RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in




సంపుటి -13 సంచిక - 435 | 29 బుధవారం జూలై 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--

# రేవంత్ 'యూత్' మంత్రం..

## బీజేపీకి రేవంత్‌రెడ్డి మాస్టర్ స్ట్రోక్?

"సమస్య వచ్చినప్పుడు స్పందించడం వేరు, ఆ సమస్యనే అవకాశంగా మార్చుకుని రాజకీయ ప్రత్యర్థులను ఇరుకున పెట్టడం వేరు" ఈ సూత్రాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పక్కాగా అమలు చేస్తున్నట్లు కనిపిస్తోంది. దేశవ్యాప్తంగా నీట్ కుంభకోణంపై యువత, విద్యార్థి లోకం అట్టుడుకుతున్న వేళ, ఆయన వేసిన '21 ఏళ్లకే పోటీ' అనే ఎత్తుగడ, సాధారణ రాజకీయ ప్రకటనల కంటే చాలా లోతైనది, వ్యూహాత్మకమైనదిగా నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఆగ్రహాన్ని ఆయుధంగా...

దేశంలో దాదాపు 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిన నీట్ వ్యవహారం.. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతను పెంచింది. ఈ ఆగ్రహాన్ని కేవలం నిరసనలకే పరిమితం చేయకుండా, దానికి ఒక రాజకీయ రూపాన్ని ఇవ్వడంలో రేవంత్ ముందడుగు వేశారు. "మీరు కేవలం బాధితులు కాదు, రేపటి శాసనకర్తలు కావాలి. మీ సమస్యలను మీరే చట్టసభల్లోకి వచ్చి పరిష్కరించుకోవాలి" అని పరోక్షంగా పిలుపునివ్వడమే ఈ ప్రతిపాదనలోని అసలు మర్మం. ఇది యువతలోని నిస్సహాయతను పారదోలి, వారిలో ఆశను, అధికారంపై ఆకాంక్షను రేకెత్తించే ప్రయత్నం.

'జై యువ'.. పాత నినాదానికి కొత్త పదును

లాల్ బహదూర్ శాస్త్రి ఇచ్చిన 'జై జవాన్ – జై కిసాన్' నినాదం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది. దానికి 'జై యువ'ను జోడించడం ద్వారా రేవంత్ మూడు కీలక సంకేతాలు పంపారు.

గుర్తింపు: సైనికులు, రైతులంత ప్రాధాన్యం యువతకు ఇస్తున్నామని చెప్పడం.

ఆధునికీకరణ: కాంగ్రెస్ పార్టీ పాత చింతకాయ పచ్చడి కాదని, ఆధునిక తరమైన 'జెన్–జీ' ఆకాంక్షలను అర్థం చేసుకోగలదని చాటడం.

ప్రత్యామ్నాయం: బీజేపీ తరచూ వాడే 'యువశక్తి' అనే నినాదానికి పోటీగా, మరింత ఆచరణాత్మకమైన, అధికార భాగస్వామ్యాన్ని వాగ్దానం చేసే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం.

జాతీయ వేదికపై రేవంత్

ఈ డిమాండ్ కేవలం తెలంగాణకు పరిమితమైనది కాదు. దీనికోసం రాజ్యాంగ సవరణ చేయాలి, ఇది పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశం. ఆగస్టులో అసెంబ్లీలో తీర్మానం చేసి ప్రధానికి పంపుతామనడం ద్వారా రేవంత్ తన పోరాటాన్ని ఢిల్లీకి మారుస్తున్నారు. తద్వారా, రాహుల్ గాంధీ తర్వాత, బీజేపీకి వ్యతిరేకంగా యువత తరపున బలంగా గళం విప్పుతున్న జాతీయ స్థాయి కాంగ్రెస్ నేతగా తనను తాను ప్రొజెక్ట్ చేసుకుంటున్నారు. ఇది ఆయన వ్యక్తిగత ఇమేజ్‌ను, రాజకీయ బరువును పెంచే ఒక మాస్టర్ స్ట్రోక్.

దీర్ఘకాలిక వ్యూహం

21 ఏళ్లకే ఓటు హక్కు ఉన్నప్పుడు, అదే వయసుకు పోటీ చేసే అర్హత ఎందుకు ఉండకూడదనేది తార్కికంగా బలమైన వాదన. ఈ డిమాండ్ నెరవేరినా, నెరవేరకపోయినా కాంగ్రెస్‌కు రాజకీయంగా లాభమే. కేంద్రం ఒప్పుకుంటే, అది కాంగ్రెస్ సాధించిన నైతిక విజయంగా, యువతకు తామిచ్చిన కానుకగా చెప్పుకోవచ్చు. ఒప్పుకోకపోతే, బీజేపీని 'యువత వ్యతిరేకి'గా చిత్రించి, రాబోయే ఎన్నికల్లో ప్రచారాస్త్రంగా వాడుకోవచ్చు. అంతిమంగా, ఈ చర్చ ద్వారా దేశంలోని కోట్లాది మంది యువ



ఓటర్లతో ఒక బలమైన బంధాన్ని ఏర్పరచుకోవడం, వారిని కాంగ్రెస్ వైపు ఆకర్షించడం ఈ వ్యూహంలో కీలక భాగం.

మొత్తం మీద, రేవంత్ రెడ్డి ప్రకటనను కేవలం నీట్ బాధితులపై జాలిగా చూడలేం. ఇది ఒకే దెబ్బకు అనేక పిట్టలను కొట్టే రాజకీయ చతురత. యువత ఆగ్రహాన్ని చల్లార్చడం, వారిని ఆకర్షించడం, బీజేపీని ఇరుకున పెట్టడం, తన జాతీయ స్థాయి ఇమేజ్‌ను పెంచుకోవడం వంటి బహుళ ప్రయోజనాలతో కూడిన ఒక పక్కా రాజకీయ ఎత్తుగడ ఇది. ఈ 'జెన్–జీ' అస్త్రం ఎంతవరకు పనిచేస్తుందో, కేంద్రం దీనిపై ఎలా స్పందిస్తుందో కాలమే నిర్ణయించాలి.

# బ్లాక్‌మెయిల్ కోసమే హైడ్రా

## : రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఫైర్

హైడ్రా కమిషనర్‌ను తక్షణమే ఆ పదవి నుంచి తొలగించాలని తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు రాష్ట్రం రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపాయి. ఈ పరిణామంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటుగా స్పందించారు. హైడ్రాను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక బ్లాక్‌మెయిల్ సాధనంగా వాడుకుంటోందని, హైకోర్టు తీర్పు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెంపపెట్టు వంటిదని ఆయన విమర్శించారు.మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన కేటీఆర్, బిల్డర్లను, సామాన్య పౌరులను లక్ష్యంగా చేసుకుని డబ్బులు వసూలు చేయడానికే హైడ్రాను ప్రయోగిస్తున్నారని ఆరోపించారు. అధికార పక్షానికి చెందిన వారి ఆస్తుల జోలికి వెళ్లడం లేదని, ఇదే నిజమైతే ముఖ్యమంత్రి సోదరుడి అక్రమ కట్టడాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే హైడ్రాను రద్దు చేస్తామని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.దేశంలో ఏ అధికారి అయినా 63 సార్లు కోర్టు ధిక్కరణకు పాల్పడిన దాఖలాలు ఉన్నాయా అని కేటీఆర్ ప్రశ్నించారు. హైడ్రా రేవంత్ రెడ్డికి వేటకుక్కలా మారిందని, దీనిని అడ్డుపెట్టుకుని బిల్డర్ల వద్ద 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూలు చేస్తున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి సోదరుడి నివాసంతో పాటు కాంగ్రెస్ నేతలు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్, మహేందర్ రెడ్డి, కేవీపీల అక్రమ కట్టడాలను ఎందుకు కూల్చివేయడం లేదని ప్రశ్నించారు. తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే హైడ్రాను బంగాళాఖాతంలో కలిపేస్తామని స్పష్టం చేశారు.నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై కూడా కేటీఆర్ స్పందించారు. ఈ ఉదంతంతో దేశ యువత



మొదటిసారిగా మోదీ ప్రభుత్వంపై తిరుగుబాటు బావుటా ఎగురవేసిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తన అసమర్థతతో సరైన మద్దతు ఇవ్వలేకపోవడంతో, విద్యార్థులే నేరుగా పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు. అవసరం వచ్చినప్పుడు యువత తప్పకుండా స్పందిస్తుందని కేసీఆర్ గతంలోనే చెప్పారని అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ హయాంలో నీట్ పేపర్

# హైదరాబాద్‌ను ముంచెత్తిన భారీ వర్షం..

## జలమయమైన రోడ్లు, స్తంభించిన ట్రాఫిక్



భాగ్యనగరాన్ని మంగళవారం సాయంత్రం భారీ వర్షం ముంచెత్తింది. హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో ఏకధాటిగా కురిసిన కుండపోత వానకు రహదారులన్నీ జలమయమయ్యాయి. దీంతో ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ ఎక్కడికక్కడ స్తంభించిపోవడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. ముఖ్యంగా కార్యాలయాల పనివేళలు ముగిసే సమయం కావడంతో హైటెక్ సిటీ, మాదాపూర్, గచ్చిబౌలి తదితర ప్రాంతాల్లో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.

మియాపూర్, కూకట్‌పల్లి, రాయదుర్గం, మణికొండ, యూసుఫ్‌గూడ, ఖైరతాబాద్, కోఠి, మలక్‌పేట, దిల్‌సుఖ్‌నగర్ సహా నగరంలోని పలు ప్రాంతాల్లోపై వర్షం ప్రభావం తీవ్రంగా ఉంది. ఈ క్రమంలో హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి పోలీసులు రంగంలోకి దిగి కీలక జంక్షన్ల వద్ద ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అదే సమయంలో హైడ్రా బృందాలు రహదారులపై నిలిచిన నీటిని తొలగించే పనులను వేగవంతం చేశాయి. కాగా, సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు కూడా నగరంలో పలుచోట్ల వర్షం కురిసింది.

# తెలంగాణలో ఏర్పడేది డబుల్ ఇంజిన్ సర్కారే

## : రాంచందర్ రావు



తెలంగాణలో రాబోయే రోజుల్లో బీజేపీ నేతృత్వంలో 'డబుల్ ఇంజిన్ ప్రభుత్వం' ఏర్పాటు కావడం ఖాయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దక్షిణ తెలంగాణలో బీజేపీ క్రమంగా బలోపేతం కావడం శుభపరిణామమని, చదువుకున్న యువత పెద్ద సంఖ్యలో పార్టీలోకి చేరుతుండటం మార్పుకు సంకేతమని పేర్కొన్నారు.సనాతన ధర్మాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్న ఆయన... అనేక దేశాలు క్రిస్టియన్, ముస్లిం దేశాలుగా మారినా సనాతన ధర్మాన్ని ఏ శక్తీ నిర్మూలించలేకపోయిందని అన్నారు. ప్రస్తుతం యువజన ఉద్యమాల ముసుగులో విదేశీ నిధులు సేకరిస్తూ దేశాన్ని విభజించేందుకు కొన్ని కుట్రలు సాగుతున్నాయని, దేశ సమగ్రతను కాపాడుకోవడానికి ప్రజలంతా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) ప్రక్రియపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని రాంచందర్ రావు తీవ్రంగా ఖండించారు. ఇది ప్రతి పదేళ్లకు ఒకసారి సాధారణంగా జరిగే ప్రక్రియ మాత్రమేనని, దీనిని అడ్డుపెట్టుకుని అనవసర భయాందోళనలు సృష్టించేందుకు యత్నిస్తున్నారని హెచ్చరించారు. దేశ భద్రత విషయంలో ఎలాంటి ఒడిదుడుకులను సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు.

# తెలంగాణ టీవీ అవార్డులకు పీవీ పేరు?..

## - మంత్రి కోమటిరెడ్డి కీలక ప్రకటన



తెలంగాణలో టెలివిజన్ రంగానికి ప్రత్యేక గుర్తింపు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. బుల్లితెర కళాకారులు, సాంకేతిక నిపుణులను ప్రోత్సహించేలా టెలివిజన్ అవార్డులను ప్రవేశపెట్టే ప్రక్రియ వేగవంతమైంది. ఈ అవార్డులకు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పేరు పెట్టే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు.టెలివిజన్ అవార్డు కమిటీ ప్రతినిధులతో మంత్రి సచివాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అవార్డుల లోగో, కేటగిరీలు, పేరుపై విస్తృతంగా చర్చించారు. తెలంగాణ సంస్కృతి, ఆత్మను ప్రతిబింబించేలా లోగో, పేరు ఉండాలని మంత్రి సూచించారు.తెలుగు జాతి ఖ్యాతిని ప్రపంచానికి చాటిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పేరును అవార్డులకు పెట్టే ప్రతిపాదనను పరిశీలిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించిన తర్వాత తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.అవార్డుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. అందుకు అవసరమైన సమగ్ర మార్గదర్శకాలను త్వరగా సిద్ధం చేయాలని టెలివిజన్ అవార్డు కమిటీ సభ్యులకు ఆదేశించారు. ప్రభుత్వ నిర్ణయంపై బుల్లితెర రంగానికి చెందిన నటీనటులు, సాంకేతిక నిపుణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టుల ఫలితాలు విడుదల




తెలంగాణ వైద్య విధాన పరిషత్(టీవీవీపీ) పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టుల ఫలితాలను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్మెంట్ బోర్డు(ఎంహెచ్ఎస్ఆర్బీ) విడుదల చేసింది.ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్ విడుదల అనంతరం అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసి, తుది ఫలితాలను ప్రకటించనున్నట్టు బోర్డు తెలిపింది. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల వివరాలను ఎంహెచ్ఎస్ఆర్బీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు పేర్కొంది.

RNI No Tel / 2012 /4241
# హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



## రామకృష్ణాపూర్ ఏరియా హాస్పిటల్, ను ఆకస్మికంగా తనిఖీ చేసిన చీఫ్ మెడికల్ ఆఫీసర్ కిరణ్ రాజ్

హైదరాబాద్ ఎస్టేట్ 28 జులై 2026
సింగరేణి సంస్థ చీఫ్ మెడికల్ ఆఫీసర్ కిరణ్ రాజ్ ఈరోజు ఉదయం 10:30 గంటలకు మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ ఏరియా హాస్పిటల్, ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ఓపీ విభాగాలు, క్యాజువాలిటీ, ఇతర వైద్య సేవల విభాగాలను పరిశీలించి, రోగులకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన పలు సూచనలు చేశారు. అనంతరం కిరణ్ రాజ్ మాట్లాడుతూ, ఏరియా హాస్పిటల్ లో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, పారామెడికల్ మరియు ఇతర సిబ్బంది సమిష్టిగా కృషి చేస్తూ, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారని, అందుకు వారిని అభినందించారు. అదేవిధంగా, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డా. మధు కుమార్ ఆసుపత్రి పరిపాలనను సమర్థవంతంగా నిర్వహిస్తూ సేవల నాణ్యతను మరింత మెరుగుపరుస్తున్నారని ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోగుల సేవల విషయంలో సింగరేణి సంస్థ ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడదని, అవసరమైన అన్ని వైద్య సౌకర్యాలను సంస్థ కల్పిస్తోందని తెలిపారు. ప్రత్యేక వైద్య సేవలు అవసరమైన సందర్భాల్లో రోగులను కార్పొరేట్ ఆసుపత్రులకు రిఫర్ చేసి అత్యుత్తమ వైద్యం అందిస్తున్నామని పేర్కొన్నారు.
సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఏరియా హాస్పిటల్‌లో అందుబాటులో ఉన్న వైద్య సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకొని



ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన కోరారు. ఈ తనిఖీలో డిప్యూటీ సూపరింటెండెంట్ (అడ్మిన్) డా. మధు కుమార్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ మదార్ సాహెబ్, తదితర వైద్యులు, అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## పచ్చదన పరిరక్షణకు సైకిల్ ర్యాలీ

### మొక్కల పెంపకంతో పర్యావరణాన్ని కాపాడాలని జంగ గోపాల్ రెడ్డి పిలుపు




హనుమకొండ, జులై 28 హైదరాబాద్ ఎస్టేట్:
పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి వాటి సంరక్షణకు కృషి చేయాలని సైకిల్ వాకర్స్ అసోసియేషన్ వరంగల్ అధ్యక్షుడు జంగ గోపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. సైకిల్ వాకర్స్ అసోసియేషన్ వరంగల్ ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్ గార్డెన్స్ నుంచి ఆర్ అండ్ బి విశ్రాంత ఉద్యోగుల భవనం వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గార్డెన్ అభివృద్ధికి నిరంతరం సేవలందిస్తున్న అసోసియేషన్ అధ్యక్షుడు రత్నాకర్‌తో పాటు వారి బృందాన్ని అభినందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ బాధ్యుడు ప్రమోద్ రెడ్డికి మొక్కలను అందజేసి, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి పి. అనంత్ కుమార్, ఉపాధ్యక్షులు మామిడి నర్సయ్య, రాపర్తి లక్ష్మయ్య, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రామకృష్ణాపూర్ ఏఐటీయూసీ పట్టణ కమిటీ ఎన్నిక

### పట్టణ అధ్యక్షులుగా కాదాని సాంబయ్య

హైదరాబాద్ ఎస్టేట్ 28 జులై 2026
మంచిర్యాల జిల్లా ఏఐటీయూసీ రామకృష్ణాపూర్ పట్టణ మహాసభలు సోమవారం సాయంత్రం ఏఐటీయూసీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఎండీ అక్బర్ అలీ అధ్యక్షతన ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేకల దాసు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక కోడ్‌ల వల్ల కార్మికుల హక్కులు దెబ్బతినే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే వచ్చే నెల ఆగస్టు 2న నిర్వహించనున్న ఏఐటీయూసీ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. పట్టణంలోని సంఘటిత, అసంఘటిత కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని, రాష్ట్ర నాయకులు కూడా ఈ మహాసభలకు హాజరవుతారని తెలిపారు. అనంతరం ఏఐటీయూసీ రామకృష్ణాపూర్ పట్టణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షులు కాదాని సాంబయ్య, పట్టణ కార్యదర్శి మండల శ్రీనివాస్, సహాయ కార్యదర్శి: దేవానంద్, ఉపాధ్యక్షుడు హుస్సేన్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు గిరి, షకీర్, ట్రెసరీ రమేష్, నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు సభలో పాల్గొన్న నాయకులు, కార్మికులు అభినందనలు తెలియజేసి, కార్మికుల సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు.

## హనుమకొండలో టీఆర్ఎస్ పార్టీ నూతన నియామకాలపై ప్రెస్ మీట్



రిపోర్టర్: హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ
తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ చీఫ్ శ్రీమతి కల్వకుంట్ల కవిత ప్రకటించిన పార్టీ నూతన నియామకాలను స్వాగతిస్తూ హనుమకొండలోని టీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నాయకులు ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గ్రేటర్ వరంగల్ అధ్యక్షుడిగా నడిపెల్లి వెంకటేశ్వరరావు, వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా వీర బిక్షపతి, వరంగల్ ఈస్ట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా వెలిగేటి రవి నియామకం పార్టీకి మరింత బలం చేకూరుస్తుందని అన్నారు. నూతన బాధ్యతలు చేపట్టిన నాయకులు పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేసి ప్రజల్లో పార్టీని బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డా. పర్లపల్లి శ్రీశైలం, లలిత, బోడ అనిల్ కుమార్, దేవి తదితర టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## సూర్యప్రకాశ్ కు గిన్నీస్ బుక్ వరల్డ్ రికార్డు

హైదరాబాద్, జూలై 28: ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త కరాటే మాస్టర్ డాక్టర్ సూర్య ప్రకాశ్ గారికి గిన్నీస్ వరల్డ్ రికార్డు గుర్తింపు. ఏప్రిల్, 26వ తేదీ, ఆదివారం ఉదయం, గచ్చి బౌలి, ఇండోర్ స్టేడియం అరుదైన అంతర్జాతీయ ప్రదర్శనకు వేదికైనదీ. ఈ నేపథ్యంలో కరాటే రంగంలో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 10 రాష్ట్రాల నుండి మొత్తం 1212 మంది క్రీడా కారులు పాల్గొన్నారు. వీరు ఏకకాలంలో 12 నిమిషాల వ్యవధిలో అద్భుతమైన కరాటే "కటాఫ్" ప్రదర్శించి, గిన్నీస్ వరల్డ్ రికార్డును సాధించారు. గిన్నీస్ వరల్డ్ రికార్డు ప్రతినిధి స్వప్నిల్ ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం జయంత్ రెడ్డి ఇంటర్నేషనల్ తైక్యాండో అకాడమి, విజన్ మార్షల్ అకాడమి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. పాతబస్తి బాలాగంజీ కు చెందిన రచయిత, సామాజిక కార్యకర్త కరాటే మాస్టర్ డాక్టర్ ఎస్. సూర్యప్రకాశ్ గారు ఈ ప్రదర్శనలో పాల్గోని గిన్నీస్ వరల్డ్ రికార్డు సాధించారు. గతంలో ఉన్న 8 నిమిషాల రికార్డును అధిగమిస్తూ, ఇంత భారీ సంఖ్యలో క్రీడాకారులు ఏక తాటిపైకి వచ్చి ఈ ఘనత సాధించారు. సూర్యప్రకాశ్ తెలంగాణా మలిదశ ఉద్యమంలో పాల్గొని తమ పాటల ద్వారా ప్రజలను చైతన్యపరచిన వీరు సమాజ సేవలో సైతం తమ వంతు కృషి చేస్తున్నారు.
వీరి సమాజ సేవను గుర్తించి, అమెరికాలోని హెచ్ బీ యూనివర్సిటీ వారు సూర్యప్రకాశ్ కు "గౌరవ డాక్టరేట్" ప్రకటించారు .
వాణిజ్యశాస్త్రంలో, "హెల్త్ ఇన్సూరెన్స్" పై కీలకమైన పరిశోధనా పత్రాన్ని సమర్పించి నందుకు హైదరాబాద్ లోని డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ వారు "ఫ్యాకల్టీ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్"- సూర్యప్రకాశ్ గారికి పిహెచ్ డి పట్టా అందజేశారు. కరాటేలో గిన్నెస్ వరల్డ్ రికార్డు సాధించినందుకు పాతనగరంలోని ఎందరో ప్రముఖులు డాక్టర్ సూర్య ప్రకాశ్ గారిని అభినందించారు.
సోమవారం సాయంత్రం బంజారాహిల్స్ రోడ్ నెంబరు వన్ లోని జేఆర్ ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్



కార్యాలయంలో ముప్పై సార్లు గిన్నిస్ బుక్ రికార్డు సాధించిన గ్రాండ్ మాస్టర్ జయంత్ రెడ్డి గారి చేతుల మీదుగా డాక్టర్ సూర్య ప్రకాష్ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సర్టిఫికెట్ తో పాటు బంగారు పతకం అందుకున్నారు.

## ఆగస్టు 6నుంచి వైఎంసీఏ కార్గిల్ విక్టరీ స్పోర్ట్స్ ఫెస్టివల్



హైదరాబాద్, జూలై 28: వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ నారాయణగూడ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఆగస్టు 6, 7, 8 తేదీల్లో 26వ వార్షిక వైఎంసీఏ కార్గిల్ విక్టరీ స్పోర్ట్స్ ఫెస్టివల్ ను నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రధానకార్యదర్శి ఎం. ప్రిస్ట్ లీ గ్రైస్ తెలిపారు. ఈ సందర్భంగా బాలబాలికలకు సీనియర్స్, జూనియర్స్ విభాగంలో బాస్కెట్బాల్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, మార్చ్ ఫాస్ట్, తదితర పోటీలు ఉంటాయని తెలిపారు. పోటీలలో పాల్గొనే విద్యార్థులు ఆగస్టు 4వ తేదీలోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు నారాయణగూడలోని వైఎంసీఏలో లేదా సెల్: 7799665544, 7032660614లో సంప్రదించాలని ఆయన కోరారు.

## జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించండి

### ఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులు, ఎంపీలను కలిసిన టీడబ్ల్యూజేఎఫ్ నేతలు

న్యూఢిల్లీ, జూలై 28: కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సిన జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర నాయకులు పలువురు కేంద్ర మంత్రులను, పార్లమెంటు సభ్యులను కలిసి విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల సమస్యలపై సోమవారం జంతర్ మంతర్ లో ధర్నా నిర్వహించిన ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బండి విజయ్ కుమార్ తదితరులు మంగళవారం కేంద్ర మంత్రులు జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీకి చెందిన పార్లమెంట్ సభ్యులు మల్లు రవి, టీఆర్ ఎస్ పార్టీకి చెందిన వద్దిరాజు రవిచంద్ర తదితరులకు వినతిపత్రాలు అందజేశారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టులకు ఉన్న రైల్వే రాయితీ పాస్ లను గత కోవిడ్ సందర్భంగా రద్దు చేశారని, ఈ సదుపాయాన్ని పునరుద్ధరించాలని వారు కోరారు. దేశవ్యాప్తంగా రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్ సదుపాయం కల్పిస్తూ జాతీయ పెన్షన్ పథకం అమలు చేయాలని, జర్నలిస్టుల రక్షణకు పార్లమెంటులో ప్రత్యేక చట్టం చేయాలని వారు కోరారు. జర్నలిస్టులకు, సొసైటీలకు ప్రభుత్వ స్థలాలు కేటాయించే విషయం పై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునః సమీక్షించి జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. జర్నలిస్టులకు సంబంధించిన ఆయా సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి



పరిష్కరించేందుకు కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నేషనల్ కౌన్సిల్ సభ్యులు కుంచం శ్రీనివాస్, పర్కాల సమ్మయ్య గౌడ్, కె.రమాదేవి,పద్మనాభరావు,నాయకులు గోపాల్, మోయిజ్ తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్ సాంకేతికతలకు గురునానక్‌లో జాతీయ వేదిక



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 28:-
రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ ఇన్‌స్టిట్యూషన్స్ టెక్నికల్ క్యాంపస్ (స్వయంప్రతిపత్తి కళాశాల)లో ఐదు రోజుల పాటు నిర్వహించిన "తదుపరి తరం విద్యుత్ వాహనాల కోసం క్వాంటం గణన సాంకేతికతలు2026" జాతీయ స్థాయి సదస్సు విజయవంతంగా ముగిసింది. విద్యుత్ మరియు ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జూలై 21 నుంచి 25 వరకు నిర్వహించిన ఈ సదస్సుకు భారత ప్రభుత్వ విజ్ఞాన శాస్త్రసాంకేతిక శాఖ పరిధిలోని అనుసంధాన్ జాతీయ పరిశోధనా ప్రతిష్ఠానం ఆర్థిక సహకారం అందించింది. విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకుల్లో క్వాంటం గణన, కృత్రిమ మేధస్సు, విద్యుత్ వాహనాల ఆధునిక సాంకేతికతలపై అవగాహన పెంపొందించడం, పరిశోధనల పట్ల ఆసక్తి కల్పించడం ఈ సదస్సు ప్రధాన లక్ష్యంగా నిర్వహించారు. ఐదు రోజుల పాటు దేశంలోని ప్రముఖ విద్యాసంస్థలు, పరిశ్రమలకు చెందిన నిపుణులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ప్రత్యేక ఉపన్యాసాలు అందించారు. ప్రత్యక్ష శిక్షణా తరగతులు, సాంకేతిక చర్చలు, అనుభవాల పంచుకోవడం వంటి కార్యక్రమాలు పాల్గొన్న వారికి విశేషంగా ఉపయోగపడ్డాయి. ఈ సందర్భంగా విద్యాసంస్థల వైస్ చైర్మన్ సర్దార్ గగన్‌దీప్ సింగ్ కోహ్లీ మాట్లాడుతూ, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథం, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించేందుకు తమ సంస్థ నిరంతరం కృషి చేస్తోందన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ డా. హెచ్.ఎస్. సైనీ మాట్లాడుతూ, పరిశ్రమలువిద్యాసంస్థల సమన్వయంతోనే వినూత్న ఆవిష్కరణలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. డైరెక్టర్ డా. ఎస్. శ్రీనాథ్ రెడ్డి, పరిశోధన విభాగం డీన్ డా. ఎస్.వి. రంగనాయకులు, విభాగాధిపతి డా. వై.వి. బాలరామకృష్ణారావు మాట్లాడుతూ క్వాంటం గణన, క్వాంటం యంత్ర అభ్యాసం, బ్యాటరీ నిర్వహణ వ్యవస్థలు, విద్యుత్ వాహనాల సాంకేతికతలపై పాల్గొన్న వారికి సమగ్ర అవగాహన కల్పించినట్లు తెలిపారు. భారతీయ సాంకేతిక విద్యాసంస్థలు, జాతీయ సాంకేతిక విద్యాసంస్థలు, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, వెల్లూరు సాంకేతిక సంస్థఆంధ్రప్రదేశ్, ఎస్ఆర్ఎం విజ్ఞానసాంకేతిక సంస్థ చెన్నైతో పాటు పలు పరిశ్రమలకు చెందిన నిపుణులు, అధ్యాపకులు, విద్యార్థులు ఈ జాతీయ సదస్సులో పాల్గొన్నారు.

## కుమార్తె జ్ఞాపకార్థం విద్యార్థులకు విద్యా కానుక

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 28:-
రంగారెడ్డి జిల్లా: ఎలిమినేడు ప్రభుత్వ పాఠశాలలో హృదయాన్ని కదిలించే సేవా కార్యక్రమం నిర్వహించబడింది. ఆర్టీసీ కండక్టర్ బజారు బిక్షపతి తన కుమార్తె దీక్షిత జ్ఞాపకార్థం పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేసి అందరి ప్రశంసలు అందుకున్నారు. గత ఏడాది జరిగిన రోడ్డు ప్రమాదంలో కుమార్తెను కోల్పోయిన ఆయన, ఆమె జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలుపుకునేందుకు విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడాలని నిర్ణయించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుతున్న సుమారు 200 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి ఐదు నోటు పుస్తకాల చొప్పున. విద్య ద్వారా పిల్లలు ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బిక్షపతి సేవా భావాన్ని కొనియాడారు. వ్యక్తిగత విషాదాన్ని సమాజ సేవగా మలచడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో చదువుపై ఆసక్తిని పెంచడమే కాకుండా సమాజంలో సేవా స్ఫూర్తిని



కూడా పెంపొందిస్తాయని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొని బిక్షపతిని అభినందించారు. ఆయన చేసిన ఈ సేవా కార్యక్రమం పలువురికి ఆదర్శంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
29 బుధవారం జూలై 2026

# ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన అంజన్‌కు ఘన సన్మానం




హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 28:- మంచాల మండలం ఆరుట్ల గ్రామానికి చెందిన యువకుడు చిందం అంజన్ కుమార్ ఒకేసారి ఐదు ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎంపిక కావడంతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాధారణ కుటుంబంలో జన్మించి ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం పూర్తి చేసిన అంజన్ కుమార్ తన కృషి, పట్టుదలతో అరుదైన విజయాన్ని సాధించడం ప్రతి యువకుడికి ఆదర్శమని కొనియాడారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకులో క్లర్క్, హైకోర్టు ఫీల్డ్ అసిస్టెంట్, రైల్వే ఎన్‌టీపీసీ విభాగంలో రెండు ఉద్యోగాలు, టీజీఎస్‌ఆర్టీసీ సూపరింటెండెంట్ పోస్టుతో కలిపి మొత్తం ఐదు ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎంపిక కావడం జిల్లాకే గర్వకారణమని అన్నారు. లక్ష్యసాధనకు నిరంతర శ్రమ, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసమే విజయానికి మూలమని పేర్కొన్నారు.నేటి యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ విద్య, పోటీ పరీక్షలపై దృష్టి సారించి అంజన్ కుమార్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. జీవితంలో స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానికోసం అంకితభావంతో శ్రమిస్తే తప్పకుండా విజయాన్ని అందుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడిమల్ల చంద్రయ్య, మార సురేష్, వస్పరి కుమార్, ఎండి అశ్రఫ్, కోరె పాండు తదితరులు పాల్గొని అంజన్ కుమార్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## హెపటైటిస్ నివారణకు అవగాహనే ఆయుధం

### : డీఎంహెచ్‌వో స్వర్ణ కుమారి




హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 28:-
రంగారెడ్డి జిల్లా: మైలార్‌దేవ్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ హెపటైటిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజల్లో కాలేయ సంబంధిత వ్యాధులపై చైతన్యం కల్పించే ఉద్దేశంతో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ స్వర్ణ కుమారి మాట్లాడుతూ హెపటైటిస్ వ్యాధిని నిర్లక్ష్యం చేయకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు. హెపటైటిస్‌బి టీకా తప్పనిసరిగా వేయించుకోవడం, పరిశుభ్రమైన ఆహారం, స్వచ్ఛమైన తాగునీటిని వినియోగించడం, సురక్షిత రక్త మార్పిడి, పరిశుభ్రమైన ఇంజెక్షన్ల వినియోగం వంటి అలవాట్లు ఈ వ్యాధి వ్యాప్తిని అరికట్టడంలో కీలకమని ఆమె వివరించారు. హెపటైటిస్ లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత పరీక్షలు చేయించుకుని అవసరమైన చికిత్స పొందాలని ప్రజలకు సూచించారు.ఈ సందర్భంగా వైద్యులు ప్రజలకు హెపటైటిస్ వ్యాధి లక్షణాలు, నివారణ మార్గాలు, చికిత్స విధానాలు, టీకాల ప్రాధాన్యతపై వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారికి ఆరోగ్య అవగాహన కరపత్రాలను పంపిణీ చేసి వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ రాకేష్, డాక్టర్ జ్యోతిబాయి, డాక్టర్ సమీనా, వైద్య అధికారి డాక్టర్ రేఖ, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొని హెపటైటిస్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రతిజ్ఞ చేశారు.

# షాదీఖానా నిర్మాణానికి రూ.5 కోట్లు విడుదల చేయాలి

### స్థలం పునరుద్ధరణ తర్వాత పనులు ప్రారంభించాలని బీఆర్‌ఎస్ మైనార్టీ నాయకుల డిమాండ్




వరంగల్, జులై 28 హైదరాబాద్ ఎస్టేట్:
ముస్లిం షాదీఖానా నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 కోట్ల నిధులు విడుదల చేసి నిర్మాణ పనులు ప్రారంభించాలని బీఆర్‌ఎస్ మైనార్టీ విభాగం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా మైనార్టీ విభాగం మాజీ అధ్యక్షుడు ఎండీ నయీమొద్దీన్, నాయకుడు మసూద్ ఈ మేరకు మాట్లాడారు. వారు మాట్లాడుతూ, 2022లో అప్పటి ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ చొరవతో కాజీపేట మండలం న్యూశాయంపేట సర్వే నంబర్ 579లో 25 గుంటల భూమిని షాదీఖానా నిర్మాణానికి కేటాయించారని, అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 కోట్ల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. అనంతరం ప్రభుత్వం మారిన తర్వాత నిర్మాణ పనుల్లో పురోగతి లేకపోవడంతో పాటు షాదీఖానాకు కేటాయించిన స్థలాన్ని వెనక్కి తీసుకున్నారని ఆరోపించారు. మైనార్టీలు, బీఆర్‌ఎస్ శ్రేణులు చేపట్టిన ఉద్యమం, మాజీ మంత్రి కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ కృషి ఫలితంగా షాదీఖానా స్థలాన్ని తిరిగి కేటాయించినట్లు పేర్కొన్నారు. స్థలానికి వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, నిర్మాణ పనులను ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు. మైనార్టీల సంక్షేమం పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని, వరంగల్‌లో షాదీఖానాతో పాటు హజ్ హౌస్ నిర్మాణాన్ని కూడా చేపట్టాలని డిమాండ్ చేశారు. షాదీఖానా స్థలం తిరిగి కేటాయించడంపై మైనార్టీలు హర్షం వ్యక్తం చేస్తూ మిఠాయిలు పంచుకుని సంబరాలు జరుపుకున్నట్లు తెలిపారు. సమావేశంలో మైనార్టీ కమిషన్ మాజీ సభ్యుడు దర్శన్ సింగ్, గ్రేటర్ వరంగల్ మాజీ డిప్యూటీ మేయర్ సిరాజుద్దీన్, ఎండీ ఖలీల్, ఎస్కే మహమూద్, ఎండీ ఇస్మాయిల్, అబ్బు ఫెరోజ్, తౌసిఫ్, రషద్, తస్లీమ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌పై విస్తృత అవగాహన.. ప్రజల భాగస్వామ్యానికి పిలుపు





హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 28:-
తొర్రూర్ డివిజన్ పరిధిలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విస్తృత ప్రచార కార్యక్రమం నిర్వహించారు. తొర్రూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్, ఫ్లోర్ లీడర్ కోశికె ఐలయ్య ఆధ్వర్యంలో ఉదయం 7:30 గంటల నుంచి 9:30 గంటల వరకు బూత్ నంబర్లు 276, 277, 278, 279 పరిధిలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఎస్ఐఆర్ కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించారు. ఓటరు జాబితాలో ప్రతి అర్హుడి పేరు సక్రమంగా నమోదు అయ్యేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలు రాగ్య నాయక్, రాజు నాయక్, హనుమంత్ గౌడ్ తదితరులు పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం మధ్యాహ్నం 11:30 నుంచి 12:30 గంటల వరకు జీహెచ్ఎంసీ ఆదిభట్ల సర్కిల్ కార్యాలయంలో 53, 54, 55, 56 డివిజన్లకు సంబంధించిన అఖిలపక్ష సమావేశం డిప్యూటీ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ, సీపీఎం, బీఆర్ఎస్ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని రాజకీయాలకు అతీతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అర్హులైన ప్రతి ఓటరు తన పేరు ఓటరు జాబితాలో నమోదు చేసుకొని ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో భాగస్వాములు కావాలని అన్ని రాజకీయ పార్టీల నాయకులకు పిలుపునిచ్చారు. దీంతో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని వర్గాల సహకారం అవసరమని సమావేశంలో అభిప్రాయపడినట్లు తెలిపారు.

# బెటాలియన్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం





హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 28:-
ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని తెలంగాణ స్పెషల్ పోలీస్ (టీజీఎస్పీ) 3వ బెటాలియన్ అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి ఆగస్టు 3న నిర్వహించనున్న పలు అభివృద్ధి, క్రీడా కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని ఆహ్వానించారు. తొర్రూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్ బాషా, అసిస్టెంట్ కమాండెంట్లు ఎం. వీరయ్య, ఆర్. పాండులు తదితరులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా నాగన్‌పల్లి రోడ్డునుంచి టీజీఎస్పీ 3వ బెటాలియన్ ప్రధాన గేటు వరకు హెచ్ఎండీఏ నిధులతో ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో నిర్మించిన అప్రోచ్ రోడ్డు పూర్తయిందని అధికారులు తెలిపారు. ఈ రహదారి ప్రారంభోత్సవాన్ని ఆగస్టు 3న ఎమ్మెల్యే చేతుల మీదుగా నిర్వహించాలని కోరుతూ ఆయనకు ప్రత్యేక ఆహ్వానం అందజేశారు. అదే రోజున ప్రారంభం కానున్న ఇంటర్నల్ బెటాలియన్ స్పోర్ట్స్ మీట్‌ను కూడా ఎమ్మెల్యే ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.భేటీలో బెటాలియన్ సిబ్బందికి సంబంధించిన హెచ్ఆర్ఏ (హౌస్ రెంట్ అలవెన్స్) ఫైల్ అంశాన్ని కూడా అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధి విస్తరణ నేపథ్యంలో తమ బెటాలియన్ పెరిఫెరీ పరిధిలోకి వచ్చినందున, జిల్లా కలెక్టర్ వద్ద పెండింగ్‌లో ఉన్న ఇంటి అద్దె భత్యం పెంపు ఫైల్‌ను త్వరితగతిన నోటిఫై చేయించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి వెంటనే స్పందించి జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే సానుకూల స్పందనకు బెటాలియన్ అధికారులు, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు రవీందర్, యుగేందర్, శేఖర్, యూనిట్ వైద్యాధికారి డాక్టర్ రవి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# భవిష్యత్ సాంకేతికతలకు గురునానక్‌లో జాతీయ వేదిక




హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 28:-
రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ ఇన్‌స్టిట్యూషన్స్ టెక్నికల్ క్యాంపస్ (స్వయంప్రతిపత్తి కళాశాల)లో ఐదు రోజుల పాటు నిర్వహించిన "తదుపరి తరం విద్యుత్ వాహనాల కోసం క్వాంటం గణన సాంకేతికతలు2026" జాతీయ స్థాయి సదస్సు విజయవంతంగా ముగిసింది. విద్యుత్ మరియు ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జూలై 21 నుంచి 25 వరకు నిర్వహించిన ఈ సదస్సుకు భారత ప్రభుత్వ విజ్ఞాన శాస్త్రసాంకేతిక శాఖ పరిధిలోని అనుసంధాన్ జాతీయ పరిశోధనా ప్రతిష్ఠానం ఆర్థిక సహకారం అందించింది. విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకుల్లో క్వాంటం గణన, కృత్రిమ మేధస్సు, విద్యుత్ వాహనాల ఆధునిక సాంకేతికతలపై అవగాహన పెంపొందించడం, పరిశోధనల పట్ల ఆసక్తి కల్పించడం ఈ సదస్సు ప్రధాన లక్ష్యంగా నిర్వహించారు. ఐదు రోజుల పాటు దేశంలోని ప్రముఖ విద్యాసంస్థలు, పరిశ్రమలకు చెందిన నిపుణులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ప్రత్యేక ఉపన్యాసాలు అందించారు. ప్రత్యక్ష శిక్షణా తరగతులు, సాంకేతిక చర్చలు, అనుభవాల పంచుకోవడం వంటి కార్యక్రమాలు పాల్గొన్న వారికి విశేషంగా ఉపయోగపడ్డాయి.
ఈ సందర్భంగా విద్యాసంస్థల వైస్ చైర్మన్ సర్దార్ గగన్‌దీప్ సింగ్ కోహ్లీ మాట్లాడుతూ, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథం, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించేందుకు తమ సంస్థ నిరంతరం కృషి చేస్తోందన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ డా. హెచ్.ఎస్. సైనీ మాట్లాడుతూ, పరిశ్రమలువిద్యాసంస్థల సమన్వయంతోనే వినూత్న ఆవిష్కరణలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. డైరెక్టర్ డా. ఎస్. శ్రీనాథ్ రెడ్డి, పరిశోధన విభాగం డీన్ డా. ఎస్.వి. రంగనాయకులు, విభాగాధిపతి డా. వై.వి. బాలరామకృష్ణారావు మాట్లాడుతూ క్వాంటం గణన, క్వాంటం యంత్ర అభ్యాసం, బ్యాటరీ నిర్వహణ వ్యవస్థలు, విద్యుత్ వాహనాల సాంకేతికతలపై పాల్గొన్న వారికి సమగ్ర అవగాహన కల్పించినట్లు తెలిపారు. భారతీయ సాంకేతిక విద్యాసంస్థలు, జాతీయ సాంకేతిక విద్యాసంస్థలు, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, వెల్లూరు సాంకేతిక సంస్థఆంధ్రప్రదేశ్, ఎస్‌ఆర్‌ఎం విజ్ఞానసాంకేతిక సంస్థ చెన్నైతో పాటు పలు పరిశ్రమలకు చెందిన నిపుణులు, అధ్యాపకులు, విద్యార్థులు ఈ జాతీయ సదస్సులో పాల్గొన్నారు.

# వరంగల్‌కు పండ్ల మార్కెట్ కావాలి

### 30 ఎకరాల్లో హోల్‌సేల్ మార్కెట్ ఏర్పాటుకు రైతు సంఘాల వినతి



వరంగల్, జులై 28 హైదరాబాద్ ఎస్టేట్:
తెలంగాణతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున వరంగల్‌కు చేరుతున్న పండ్ల ఉత్పత్తుల కొనుగోలు, విక్రయాలకు ప్రత్యేక హోల్‌సేల్ మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని రైతు సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు వరంగల్ పండ్ల మార్కెట్ భూసాధన కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ ఎర్ర ప్రియాంక, డైరెక్టర్లు పులి అనిల్, పూర్ణచందర్‌లకు వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రంలో నాయకులు పేర్కొన్న వివరాల ప్రకారం, తెలంగాణలోని వివిధ జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి రైతులు పెద్ద ఎత్తున పండ్లను వరంగల్‌కు హోల్‌సేల్ విక్రయాల కోసం తీసుకొస్తున్నారు. అయితే ప్రత్యేక పండ్ల మార్కెట్ లేకపోవడంతో రైతులు, వ్యాపారులు నిల్వ, విక్రయాలు, రవాణా నిర్వహణలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వరంగల్ నగర శివారులో 30 ఎకరాల భూమిని సేకరించి గోదాములు, షెడ్లు, పార్కింగ్ తదితర మౌలిక వసతులతో కూడిన ఆధునిక పండ్ల హోల్‌సేల్ మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. దీనివల్ల రైతులకు గిట్టుబాటు ధరలు లభించడంతో పాటు వరంగల్ ప్రాంతీయ పండ్ల వ్యాపార కేంద్రంగా మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్, అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఏఐకేఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి ఈసంపల్లి బాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చుక్క మొగిలి, అఖిల భారత కిసాన్ సంఘటన్ జిల్లా అధ్యక్షుడు సుధమల్ల భాస్కర్, ఏఐయూకేఎస్ అధ్యక్షుడు మైదంపాని, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు జక్కుల తిరుపతి, హంసల్ రెడ్డి, బండి వెంకటేశ్వర్లు, బోళ్ల ఎల్లయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



## గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే KR నాగరాజు గారు...

### విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ...



హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ పర్వతగిరి మండలంలోని గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలను మంగళవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి శ్రీ కేఆర్ నాగరాజు గారు,వరంగల్ జిల్లా కలెక్టర్ శ్రీమతి సత్య శారదా దేవి గారితో కలిసి సందర్శించారు.విద్యార్థిలకు అందుతున్న భోజనం, వసతి, తాగునీరు, పరిశుభ్రత, మరుగుదొడ్ల సౌకర్యాలను ఆయన పరిశీలించారు.హాస్టల్ లో హాజరు పటికను పరిశీలించి విధులకు రాని సిబ్బందిపై మండిపడ్డారు.విధులలో అలసత్వం నిర్వహిస్తున్న వార్డెన్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు.విద్యార్థులతో ఆప్యాయంగా మాట్లాడి వారి విద్యాభ్యాసం,వసతి, భోజనం, ఇతర సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు.పాఠశాలలో అందుతున్న సదుపాయాలను పరిశీలించిన ఎమ్మెల్యే, విద్యార్థుల సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు.విద్యార్థులతో కలిసి భోజనం చేసి ఆహార నాణ్యతను తెలుసుకున్నారు.ఇటీవల పాఠశాలను సందర్శించిన సందర్భంగా విద్యార్థులు దుప్పట్లు కావాలని ఎమ్మెల్యే గారికి కోరడంతో ఈ రోజు మంగళవారం ఎమ్మెల్యే గారు కలెక్టర్ గారితో కలిసి 150మంది విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు.విద్యార్థులకు ఆటలకు అవసరమైన సామాగ్రి కూడా ఇప్పిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు సావిత్రి,జిల్లా ఉపాధ్యక్షులు పిన్నింటి అనిల్,స్థానిక సర్పంచ్ శంకర్,పర్వతగిరి గ్రామశాఖ అధ్యక్షులు కుసం రామచందర్,సర్పంచుల ఫోరం అధ్యక్షులు వెంకటేశ్వర రావు,ఏనుమాముల మార్కెట్ డైరెక్టర్ గొడుగు బిక్షపతి,ఐనవోలు దేవస్థానం డైరెక్టర్ వెంకన్న,మండల, గ్రామ,ముఖ్య నాయకులు,సర్పంచులు, మాజీ ప్రజా ప్రతినిధులు,నాయకులు, కార్యకర్తలు,వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 3 నుంచి దళిత క్రైస్తవ శాంతియుత మహాదీక్షలు

### ఎస్సీ హోదా సాధనకు ఉద్యమాన్ని ఉద్ధృతం చేయాలని డీసీఐవీ పిలుపు





వరంగల్, జులై 28 హైదరాబాద్ ఎస్టేట్:
దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 3 నుంచి 7 వరకు రెండు తెలుగు రాష్ట్రాల జిల్లా కేంద్రాల్లో శాంతియుత మహాదీక్షలు నిర్వహించనున్నట్లు దళిత క్రైస్తవ ఐక్యవేదిక (డీసీఐవీ) వ్యవస్థాపక అధ్యక్షుడు ఈర్ల కుమార్ మాదిగ తెలిపారు. ఆగస్టు 10న హనుమకొండలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం నుంచి వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు శాంతియుత నిరసన ర్యాలీ చేపడతామని వెల్లడించారు. మంగళవారం వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మతం మారినప్పటికీ దళిత క్రైస్తవులు సామాజిక వివక్షను ఎదుర్కొంటున్నారని, రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా వారికి ఎస్సీ హోదా కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ అంశంపై పార్లమెంట్‌లో చర్చించి తగిన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని పలు కమిషన్లు చేసిన సిఫార్సులను అమలు చేయాలని, సామాజిక న్యాయం దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఆగస్టు 3 నుంచి 7 వరకు జరిగే మహాదీక్షలు, ఆగస్టు 10న నిర్వహించే శాంతియుత నిరసన ర్యాలీలో బిషప్‌లు, పాస్టర్ల సంఘాలు, చర్చి నాయకులు, దళిత సంఘాలు, మేధావులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో డీసీఐవీ రాష్ట్ర నాయకులు మాదాసి బిక్షపతి మాదిగ, సందేలా లాజర్, ఎర్రోళ్ల బాబు, నాగారపు స్వామి, మేకల బాబు, సిలువేరు నగేష్, జన్ను శ్యామ్, పాస్టర్లు బరిగల జనార్దన్, నలగంటి విల్సన్, చిదిరల ముకేశ్, డాక్టర్ గణిపాక క్రాంతి, ఆరిశం శంకర్, ఈర్ల హరినాథ్, వెండి రాజు తదితరులు పాల్గొన్నారు.

## నాయక్‌నగర్‌లో ఘనంగా శీతల భవాని వేడుకలు

### పశుసంపద, పంటల సమృద్ధి కోసం ప్రత్యేక పూజలు..

### బంజారా సంస్కృతిని చాటిన వేడుకలు





హనుమకొండ, జులై 28 హైదరాబాద్ ఎస్టేట్:
హనుమకొండ జిల్లా రెండో డివిజన్ గుండ్ల సింగారం నాయక్‌నగర్ ఇందిరమ్మ కాలనీలో బంజారా గిరిజనుల ఆరాధ్య దైవమైన శీతల భవాని ఉత్సవాలను తొలిసారిగా భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గిరిజన కుటుంబాలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించాయి. బంజారా సంప్రదాయంలో విశిష్ట స్థానం కలిగిన శీతల భవాని పండుగను పశుసంపద వృద్ధి, పంటలు సమృద్ధిగా పండడం, సకాలంలో వర్షాలు కురవడం, గ్రామంలో సుఖశాంతులు నెలకొనాలనే ఆకాంక్షతో నిర్వహిస్తారు. ఈ సందర్భంగా గిరిజన మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో నవధాన్యాలు, బెల్లంతో తయారు చేసిన లాప్సి (పాయసం), గుగ్రీ (గుగ్గిళ్లు)ని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం సంప్రదాయ నృత్యాలతో శీతల భవానిని ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రతిష్ఠించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు కోరారు. ఈ వేడుకలు బంజారా సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బానోతు గద్దర్ నాయక్, భూక్య సిద్ధు నాయక్, లకావత్ రాజేష్ నాయక్, అంగోత్ శ్రీను నాయక్, గుగులోత్ వీరన్న నాయక్, భూక్య రాజు నాయక్, దారావత్ సమ్మయ్య, గుగులోత్ రమేష్, గుగులోత్ సర్దార్, లకావత్ సూర్య, బాదావత్ బాలాజీ, లౌడియా వెంకన్న, భూక్య వెంకన్న, గుగులోత్ రాములు, భూక్య లక్ష్మణ్, మాలోతు రాజు, లకావత్ మురళి, భూక్య అనిల్, లౌడియా చోటు, భూక్య లింగయ్య, గుగులోత్ సంతోష్, భూక్య పవన్, గుగులోత్ తిరుపతి తదితర గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

## కాజీపేట డివిజన్‌పై కేంద్రానికి బీఆర్ఎస్ వినతి

### రైల్వే, ఐటీ ప్రాజెక్టుల వేగవంతానికి కేటీఆర్ బృందం విజ్ఞప్తి




న్యూఢిల్లీ, జులై 28 హైదరాబాద్ ఎస్టేట్:
తెలంగాణలో రైల్వే, ఐటీ రంగాలకు సంబంధించిన కీలక ప్రాజెక్టులను వేగవంతం చేయాలని కేంద్ర రైల్వే, ఎలక్ట్రానిక్స్ & ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం కోరింది. అనంతరం ఎంపీ వద్దిరాజు రవిచంద్ర నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో కేటీఆర్ ఈ వివరాలను వెల్లడించారు. సమావేశంలో రాజ్యసభ సభ్యుడు దీవకొండ దామోదర్‌రావు, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాజీపేట కేంద్రంగా కొత్త రైల్వే డివిజన్ ఏర్పాటు చేయడంతో పాటు, మనోహరాబాద్‌సిద్దిపేటసిరిసిల్లవేములవాడకొత్తపల్లి రైల్వే మార్గం పనులను వేగవంతం చేయాలని, సిరిసిల్ల, వేములవాడ రైల్వే స్టేషన్లను 'అమృత్ భారత్ స్టేషన్' పథకంలో చేర్చాలని కేంద్ర మంత్రిని కోరినట్లు కేటీఆర్ తెలిపారు. అలాగే మిడ్‌మానేరు రిజర్వాయర్‌పై రైల్వే కమ్ రోడ్ బ్రిడ్జి నిర్మాణం, కొత్తపల్లిమనోహరాబాద్ మార్గం విద్యుతీకరణను కూడా ప్రతిపాదించినట్లు చెప్పారు. ఐటీ రంగంలో వరంగల్‌లో ఇండియాఏఐ కేంద్రం లేదా ఇండియాఏఐ డేటా ప్రయోగశాల ఏర్పాటు చేయాలని, కరీంనగర్ లేదా ఖమ్మంలో ఎస్‌టీపీఐ పారిశ్రామిక ఆవిష్కరణ కేంద్రం ఏర్పాటు చేయాలని, రాష్ట్రంలోని మరో ద్వితీయ శ్రేణి నగరానికి అదనపు ఎస్‌టీపీఐ కేంద్రాన్ని మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు. ఇప్పటికే ఉన్న ఐటీ మౌలిక సదుపాయాలను వినియోగించి కేంద్ర డిజిటల్ కార్యక్రమాలను తెలంగాణ జిల్లాలకు విస్తరించాలని విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధికి దోహదపడే రైల్వే, ఐటీ ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చి త్వరితగతిన అమలు చేయాలని బీఆర్ఎస్ ప్రతినిధి బృందం విజ్ఞప్తి చేసినట్లు కేటీఆర్ తెలిపారు.

## రాజ్యాధికారంతోనే మాదిగలకు సాధికారత

### - వంగపల్లి శ్రీనివాస్

### - రిజర్వేషన్ల ఉద్యమం పూర్తయింది..

### - ఇక రాజకీయ భాగస్వామ్యమే తదుపరి లక్ష్యమని పిలుపు



వరంగల్, జులై 28 హైదరాబాద్ ఎస్టేట్:
ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం మూడు దశాబ్దాలకుపైగా సాగిన ఉద్యమం కీలక దశకు చేరిందని, ఇక మాదిగల రాజకీయ సాధికారత, రాజ్యాధికారంలో భాగస్వామ్యమే తదుపరి ఉద్యమ లక్ష్యమని ఎంఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. వరంగల్ జిల్లా కేంద్రంలోని హరిత హోటల్‌లో మంగళవారం నిర్వహించిన ఎంఆర్పీఎస్ ఉమ్మడి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో మాదిగలు అధిక జనాభా కలిగిన వర్గమైనప్పటికీ విద్య, ఆర్థిక, రాజకీయ రంగాల్లో తగిన ప్రాతినిధ్యం ఇంకా దక్కలేదని అభిప్రాయపడ్డారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం 32 ఏళ్లుగా సాగిన ఉద్యమం విజయవంతమైందని, ఆ విజయాన్ని ఉద్యమ అమరవీరులకు అంకితం చేస్తున్నామని తెలిపారు. రిజర్వేషన్ల అంశంలో సాధించిన ఫలితాలతో ఉద్యమం ముగిసిపోలేదని, ఇక రాజ్యాధికారంలో మాదిగలకు సముచిత భాగస్వామ్యం కల్పించే దిశగా మరో దశ ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రాజకీయ ప్రాతినిధ్యం పెంపు, రాజ్యాధికారంలో భాగస్వామ్యం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు, ప్రజా చైతన్య కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. సమావేశంలో ఎంఆర్పీఎస్ కోర్ కమిటీ సభ్యులు నామిండ్ల చిన్నస్వామి, ఎదనూరి యాకన్న, పందుల సంజీవ, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు కొల్లూరు వెంకటేష్, రాష్ట్ర నాయకులు రామంచ సారన్న, గద్దం బద్రన్న, అంజన్న, వరంగల్ జిల్లా అధ్యక్షుడు కుమార్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రేణుకుంట మహేష్, కొంగర స్వామి, కొమ్ముల యోషోభు, వెంకన్న, ఉట్ల మోహన్, గద్దం శ్యామ్, మీసాల విజయ్ తదితరులు పాల్గొన్నారు.


## ఉచిత కంటి వైద్య శిబిరం



హైదరాబాద్ ఎస్టేట్ మద్దిరాల (ప్రతినిధి )
గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందు బాటలోకి తీసుకురావడమే లయన్స్ క్లబ్ లక్ష్యమని లయన్స్ మండల అధ్యక్షులు జిలకర చంద్రమౌళి అన్నారు మండలంలోని పోలుమల్ల, చందుపట్ల గ్రామాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ సూర్యాపేట కంటి ఆసుపత్రి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాలను ప్రారంభించి మాట్లాడారు లైన్స్ క్లబ్ వారు చేస్తున్నటువంటి సేవలను చుట్టుపక్కల గ్రామాల వారు ఉపయోగించుకోవాలని ఆయన అన్నారు ఈ సందర్భంగా పోలుమల్ల గ్రామంలో వందమందికి పైగా కంటి పరీక్షలు చేయించుకోగా వారిలో 32 మంది ఆపరేషన్ కు ఎంపికయ్యారు. చందుపట్ల గ్రామంలో 50 మంది కంటి పరీక్షలు చేసుకోగా 25 మంది ఆపరేషన్ కు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డైరెక్టర్ వైస్ యం పి పి శ్రీరాంరెడ్డి పోలుమల్ల సర్పంచ్ రేసు లింగయ్య గౌడ్, చందుపట్ల గ్రామ సర్పంచ్ పాల్వాయి కర్ణాకర్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు జిలకర చంద్రమౌళి, సెక్రటరీ తొనుకు నూరి అశోక్ కోశాధికారి బెడిద వెంకన్న వ్యవస్థాపక అధ్యక్షులు దుగ్యాల రవీందర్ రావు ఏలేటి నారాయణరెడ్డి బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ పాతూరి లింగారెడ్డి మాజీ సర్పంచ్ చిలువేరు లింగరాజు దుగ్యాల శేషగిరిరావు యాటకారి మహేష్ కంటి వైద్యురాలు డాక్టర్ శాంతి, ఇందిర, ప్రజలు గ్రామ పంచాయతీల సిబ్బంది తదితరులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయడం జరిగింది.

## జులై 30న హనుమకొండలో ఏబీవీపీ 'స్టూడెంట్ మార్చ్'

### ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలతో పాటు విద్యార్థి సమస్యల పరిష్కారానికి డిమాండ్




హనుమకొండ, జులై 28 హైదరాబాద్ ఎస్టేట్:
ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జులై 30న హనుమకొండలో 'స్టూడెంట్ మార్చ్' నిర్వహించనున్నట్లు ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచెర్ల రాంబాబు తెలిపారు. మంగళవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన లక్షలాది మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంపై ఆధారపడి ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలు విడుదల కాకపోవడంతో విద్యార్థులు విద్య, ఉపాధి అవకాశాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేసి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని సమర్థంగా అమలు చేయాలని, విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గురుకులాల్లో జరిగిన విద్యార్థుల మరణాలకు ప్రభుత్వం బాధ్యత వహించాలని, నైతిక బాధ్యత స్వీకరిస్తూ విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని కూడా కోరారు. సమస్యలు పరిష్కారం కాకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను విస్తరిస్తామని పేర్కొంటూ, జులై 30న నిర్వహించే 'స్టూడెంట్ మార్చ్'ను విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజాసంఘాలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జూపల్లి దీపిక, వరంగల్ విభాగ్ కన్వీనర్ ఆరెపల్లి సుజిత్, సిద్ధు, కృష్ణ, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
29 బుధవారం జూలై 2026

# ఉప సర్పంచ్ లకు గౌరవ వేతనం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం ఇచ్చిన జిల్లా అధ్యక్షులు అంగోత్ భాస్కర్ నాయక్



హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జూలై 28
గ్రామ పంచాయతీల ఉపసర్పంచులకు చెక్కు పవర్ అధికారాన్ని కొనసాగించుట మరియు గౌరవ వేతనం మంజూరు చేయుటకు రాష్ట్ర ఉప సర్పంచ్ ల ఫోరమ్ పిలుపు మేరకు రంగా రెడ్డి జిల్లా అధ్యక్షులు అంగోత్ భాస్కర్ నాయక్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. మేము తెలంగాణ రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు ప్రజలచే ఎన్నిక చేయబడిన ఉపసర్పంచులము. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం2018 ప్రకారం ఉపసర్పంచుల పదవి ఒక చట్టబద్ధమైన ప్రజాప్రతినిధి పదవి. గ్రామ పంచాయతీ పరిపాలనలో సర్పంచ్‌కు సహకరిస్తూ, గ్రామాభివృద్ధి కార్యక్రమాల అమలు, గ్రామ సభల నిర్వహణ, పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాలు, సంక్షేమ కార్యక్రమాల పర్యవేక్షణ, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలలో మేము కీలక పాత్ర పోషిస్తున్నాము. ప్రస్తుతం గ్రామ పంచాయతీలలో సర్పంచ్‌తో సమానంగా ఉపసర్పంచ్‌కు కూడా చెక్కు సంతకం ( చెక్ పవర్ )అధికారం ఉండడం వల్ల గ్రామ పంచాయతీ నిధుల వినియోగంలో పారదర్శకత, జవాబుదారీతనం మరియు పరస్పర పర్యవేక్షణ కొనసాగుతున్నాయి. ఈ విధానం గ్రామ పంచాయతీ పాలనను మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి దోహదపడుతోంది.అయితే, ఇటీవల ఉపసర్పంచుల చెక్కు సంతకం అధికారాన్ని తొలగించే ప్రతిపాదనలు జరుగుతున్నాయనే సమాచారం మాకు అందింది. ఒకవేళ ఈ అధికారాన్ని ఉపసర్పంచుల నుండి తొలగిస్తే, తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం2018 యొక్క స్ఫూర్తికి విరుద్ధంగా ఉండటమే కాకుండా, గ్రామ పంచాయతీలలో అధికారాల సమతుల్యత, పారదర్శకత మరియు ప్రజాస్వామ్య పరిపాలనపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రజలచే ఎన్నికైన ఉపసర్పంచుల గౌరవాన్ని కూడా ఇది దెబ్బతీస్తుంది. అందువల్ల, ఉపసర్పంచులకు ప్రస్తుతం అమలులో ఉన్న చెక్కు సంతకం (చెక్ పవర్ ) అధికారాన్ని యథావిధిగా కొనసాగించాలని కోరారు. అదేవిధంగా, గ్రామ పంచాయతీ అభివృద్ధి మరియు ప్రజాసేవలో ఉపసర్పంచులు నిరంతరం సమయం, శ్రమ వెచ్చిస్తూ బాధ్యతలు నిర్వర్తిస్తున్నప్పటికీ, ప్రస్తుతం ఎటువంటి గౌరవ వేతనం అందడం లేదు. ఈ నేపథ్యంలో, మా సేవలను గుర్తించి ప్రతి ఉపసర్పంచ్‌కు నెలకు కనీసం ₹,000/- గౌరవ వేతనం మంజూరు చేయవలసిందిగా కోరారు. , గ్రామ పంచాయతీల బలోపేతం మరియు ప్రజాస్వామ్య వికేంద్రీకరణ లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని:

1. ఉపసర్పంచులకు ప్రస్తుతం ఉన్న చెక్కు సంతకం (చెక్ పవర్ ) అధికారాన్ని యథాతథంగా కొనసాగించవలెను.
2. ప్రతి ఉపసర్పంచ్‌కు నెలకు కనీసం ₹,000/- గౌరవ వేతనం మంజూరు చేయవలెను అని పంచాయతీల

ఉపసర్పంచుల తరఫున. డిమాండ్ చేశారు ఈ కార్యక్రమం లో గౌరవ అధ్యక్షులు రాళ్ల బండి శివకుమార్ వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మరి నరేష్ ఉపాధ్యక్షులు టీ రోహిత్ జి బాలరాజ్ ఈ యాదగిరి రెడ్డి ప్రధాన కార్యదర్శి ఎం ప్రకాష్ గౌడ్ అధికార ప్రతినిధి అభినవ్ కార్యవర్గ సభ్యులు కే విజయ్ కుమార్ ఉపాధ్యక్షులు సి ప్రభాకర్ చిర్ర లక్ష్మయ్య జై మల్లేష్ షాద్నగర్ నియోజకవర్గం అధ్యక్షులు ఏం గోవర్ధన్ రెడ్డి మహేశ్వరం మండల అధ్యక్షులు దయాకర్ రెడ్డి చౌదరి గూడ మండల అధ్యక్షులు డి గణేష్ కొత్తూరు మండల అధ్యక్షులు ఆరోగ్యం కేశంపేట మండల అధ్యక్షులు షకీల్ నందిగామ మండల అధ్యక్షులు శివశంకర్ మంచాల మండల అధ్యక్షులు యాదగిరి కర్తాల్ మండల అధ్యక్షులు రఘుపతి నాయక్ వివిధ మండలాధ్యక్షులు ఉపసర్పంచ్లు పాల్గొన్నారు


# పెద్ది సుదర్శన్ రెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యే రేవూరి

## యశోద ఆస్పత్రిలో వైద్యులతో ఆరోగ్య పరిస్థితిపై ఆరా.. త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష



సికింద్రాబాద్, జులై 28 హైదరాబాద్ ఎస్టేట్:
సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మంగళవారం సాయంత్రం పరామర్శించారు. ఈ సందర్భంగా వైద్యులను కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితి, కొనసాగుతున్న చికిత్సపై సమగ్ర వివరాలు తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించి త్వరితగతిన కోలుకునేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్య బృందాన్ని కోరారు. అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను కలిసి మనోధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ, నర్సంపేట ప్రజలకు పెద్ది సుదర్శన్ రెడ్డి అందించిన సేవలు విశిష్టమైనవని పేర్కొన్నారు. ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని మళ్లీ ప్రజా జీవితంలో చురుకుగా పాల్గొని ప్రజాసేవను కొనసాగించాలని ఆకాంక్షించారు. పెద్ది సుదర్శన్ రెడ్డి త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

# రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రైతులు



హైదరాబాద్ ఎస్టేట్ మద్దిరాల (ప్రతినిధి )
మండల కేంద్రం లోని రైతు వేదికలో తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమ ప్రారంభోత్సవం సందర్భంగా, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మండలం వ్యవసాయ అధికారి అనిషా రూహి ఈ సందర్భంగా రైతు నేస్తంపై వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడిన అంశాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు అనంతరం ఆమె మాట్లాడుతూ, రైతు సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతులకు అవసరమైన సేవలు, సాంకేతిక సహాయం, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ప్రతి రైతుకు చేరేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి సత్యనారాయణ రెడ్డి ఎఈఓలు పలువురు అధికారులు మరియు వివిధ గ్రామాల సర్పంచులు రైతులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు

# ఎల్‌నినో ప్రభావం.. ప్రత్యామ్నాయ పంటల సాగుకు సూచన

## 'రైతునేస్తం' 100వ ఎపిసోడ్‌లో రైతులకు వ్యవసాయ నిపుణుల అవగాహన






గీసుగొండ, జులై 28 హైదరాబాద్ ఎస్టేట్:
ఎల్‌నినో ప్రభావంతో రుతుపవనాలు ఆలస్యమైన నేపథ్యంలో రైతులు వరి సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలని వ్యవసాయ నిపుణులు సూచించారు. కొనాయమాకుల రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన 'రైతునేస్తం' 100వ ఎపిసోడ్ ప్రత్యక్ష ప్రసారంలో రైతులకు వాతావరణానుకూల సాగు విధానాలపై అవగాహన కల్పించారు. తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త, కోఆర్డినేటర్ డాక్టర్ వెంకట రాజ్‌కుమార్ మాట్లాడుతూ, ఆగస్టు 15లోపు వరికి బదులుగా పప్పుధాన్యాలు, సిరిధాన్యాలు, నూనెగింజ పంటలు, తక్కువ కాలపరిమితి గల మొక్కజొన్న, కూరగాయల సాగు చేపట్టడం ద్వారా వర్షాభావ పరిస్థితుల్లో నష్టాలను తగ్గించుకోవచ్చన్నారు. స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి పి. హరి ప్రసాద్ బాబు మాట్లాడుతూ, వ్యవసాయ శాఖ సిఫార్సు చేసిన ప్రత్యామ్నాయ పంటలనే సాగు చేయాలని రైతులకు సూచించారు. విత్తనాల కోసం సంబంధిత వ్యవసాయ విస్తరణాధికారి (ఏఈఓ) లేదా మండల వ్యవసాయ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. విత్తన మేళాలో గ్రామ సర్పంచ్ వజ్ర రాజు మాట్లాడుతూ, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు విధానాలను అవలంబించడం ద్వారా రైతులు ఆర్థిక నష్టాలను తగ్గించుకోవచ్చన్నారు. ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను అమలు చేసి లాభదాయక సాగు వైపు అడుగులు వేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రమేష్, తహసీల్దార్ ఎండీ రియాజుద్దీన్, ఏఓ(టి) సీహెచ్ కృష్ణారెడ్డి, పశువైద్య అధికారి శ్రీనివాస్, ఉద్యాన అధికారి మానస, ఏఈఓలు, విత్తన డీలర్ల సంఘం ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# విజయవంతంగా ముగిసిన రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) జాతీయ కార్యవర్గ సమావేశాలు


## అక్టోబర్‌లో నాగపూర్‌లో జాతీయ కార్యవర్గ సమావేశాలు ఫిబ్రవరిలో విజయవాడలో దక్షిణ భారత మహాసభ నిర్వహణకు నిర్ణయం






హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి గుంటూరు, జూలై 28, 2026:
రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) జాతీయ కార్యవర్గ సమావేశాలు ముంబైలో పార్టీ జాతీయ అధ్యక్షులు శ్రీ దీపక్ భౌ నికాల్జే అధ్యక్షతన విజయవంతంగా ముగిశాయని పార్టీ జాతీయ కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు డా. పిట్టా వరప్రసాద్ తెలిపారు.ఈ సమావేశాల్లో పార్టీ బలోపేతం, సభ్యత్వ విస్తరణ, దేశవ్యాప్తంగా పార్టీ నిర్మాణాన్ని మరింత పటిష్ఠం చేయడం, సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు మరియు ఇతర బలహీన వర్గాల హక్కుల పరిరక్షణ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించి పలు కీలక తీర్మానాలను ఆమోదించారు.జాతీయ కార్యవర్గం నిర్ణయం మేరకు వచ్చే అక్టోబర్ నెలలో నాగపూర్‌లో జాతీయ కార్యవర్గ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. అలాగే 2027 ఫిబ్రవరి నెలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడలో దక్షిణ భారత (సౌత్ ఇండియా) మహాసభను అత్యంత వైభవంగా నిర్వహించాలని తీర్మానించారు.విజయవాడలో జరగనున్న ఈ మహాసభకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల నుంచి వేలాది మంది పార్టీ ప్రతినిధులు, సామాజిక ఉద్యమకారులు, రాజ్యాంగ పరిరక్షకులు పాల్గొంటారని డా. పిట్టా వరప్రసాద్ తెలిపారు.ఈ సందర్భంగా మహాసభ విజయవంతం కావడానికి ఇప్పటి నుంచే పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లు ప్రారంభించాలని ఆయన పిలుపునిచ్చారు. బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాల సాధన కోసం పార్టీని మరింత బలోపేతం చేసి, సామాజిక న్యాయం కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

# ఆరోగ్య సేవలతో ఇంజాపూర్‌లో ఉచిత వైద్య శిబిరాల సందడి





హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 28:-
రంగారెడ్డి జిల్లా: ఇంజాపూర్ బొడ్రాయి ప్రాంతంలో స్థానిక ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి విశేష స్పందన పొందాయి. బంధన్ బ్యాంక్ సహకారంతో జుబిలెంట్ భారతీయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాధారణ వైద్య శిబిరంలో డాక్టర్ మనోహర్ నేతృత్వంలోని వైద్య బృందం ప్రజలకు రక్తపోటు, మధుమేహ పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య పరిస్థితులను పరిశీలించింది. అవసరమైన వారికి వైద్య సలహాలు అందించడంతో పాటు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అదే సందర్భంగా ఇంజాపూర్ వార్డు కార్యాలయం ఎదుట ఎఫ్ఎస్ డెంటల్ స్టూడియో ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ మొహమ్మద్ హరూన్ మాలిక్ ప్రజలకు దంత పరీక్షలు నిర్వహించి నోటి ఆరోగ్యాన్ని కాపాడుకునే విధానాలపై అవగాహన కల్పించారు. దంత సమస్యలతో వచ్చిన వారికి తగిన వైద్య సూచనలు అందించడంతో పాటు అవసరమైన చికిత్సలపై వివరించారు. ఈ కార్యక్రమాల్లో బొక్క వంశీధర్ రెడ్డి, ఎండి గౌస్, సోమేశ్ తదితరులు పాల్గొని శిబిరాల నిర్వహణకు సహకరించారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవడంతో నిర్వాహకులను అభినందించారు. ఇలాంటి ఆరోగ్య శిబిరాలు గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరమని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# పచ్చదనమే భావితరాలకు జీవన భరోసా

## ప్రతి ఇంటా మొక్క నాటి బాధ్యతగా సంరక్షించాలి : సర్పంచ్ గాలి యాకయ్య



గీసుగొండ, జూలై 28 హైదరాబాద్ ఎస్టేట్:
పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యత నిర్వర్తించాలని, ప్రతి ఇంటి వద్ద కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన జీవన వాతావరణాన్ని అందించవచ్చని శాయంపేట(హ) గ్రామ సర్పంచ్ గాలి యాకయ్య అన్నారు. గీసుగొండ మండలంలోని శాయంపేట(హ) గ్రామంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులకు మొక్కలను పంపిణీ చేసి, గ్రామంలో మొక్కలు నాటారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపు, మొక్కల సంరక్షణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గాలి యాకయ్య మాట్లాడుతూ వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్యం నేపథ్యంలో పచ్చదనాన్ని పెంపొందించడం నేటి అత్యవసర అవసరంగా మారిందన్నారు. మొక్కలు నాటడం ఒక కార్యక్రమం మాత్రమే కాదని, వాటిని బతికించి సంరక్షించినప్పుడే వనమహోత్సవం లక్ష్యం సార్థకమవుతుందని పేర్కొన్నారు. గ్రామాన్ని హరిత గ్రామంగా తీర్చిదిద్దడంలో ప్రతి కుటుంబం భాగస్వామి కావాలని, నాటిన ప్రతి మొక్కను బాధ్యతగా కాపాడాలని పిలుపునిచ్చారు. ఉపసర్పంచ్ ఊరుగొండ అనిత మురళి మాట్లాడుతూ మొక్కలు ప్రకృతికి జీవనాధారమని, పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాల్సిన అవసరం ఉందన్నారు. హరిత గ్రామ నిర్మాణానికి గ్రామస్థులందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు గాలి అనిల్, కొంగర సారిబాబు, సుధమళ్ల పవన్, గాలి కళావతి, జూల రమేష్, తాళ్లపెల్లి చంద్రమోహన్, తండా సరస్వతి, మామిడి శ్రీవిద్య, శ్రీరాముల ఉషశ్రీ, పంచాయతీ కార్యదర్శి బేతి సునీల్, తాత్కాలిక కారోబార్ అట్లా కట్టమల్లు, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# కొత్త ఫోన్, ఎవరు మాట్లాడేది? నిహారిక జోష్ చూసారా!

నటిగా.. యాంకర్ గా.. నిర్మాతగా ఆల్ రౌండర్ పనితనం చూపించిన నిహారిక ఇటీవలి కాలంలో సోషల్ మీడియాల్లోను జోరుమీద ఉన్నారు. మెగా ప్రిన్సెస్ నిరంతర ఫోటోషూట్లు ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతున్నాయి. తాజాగా కొత్త ఫోటోలను షేర్ చేస్తూ నిహారిక -కొత్త ఫోన్, ఎవరు మాట్లాడేది?- అంటూ సరదా క్యాప్షన్ను జోడించారు. ఈ స్టైలిష్ లుక్ కోసం పనిచేసిన డిజైనర్లు, స్టైలిస్టులు, ఫోటోగ్రాఫర్లకు ధన్యవాదాలు తెలుపుతూ పెట్టిన పోస్ట్కి కొన్ని గంటల్లోనే వేల సంఖ్యలో లైక్లు, కామెంట్లు వచ్చిపడ్డాయి. అభిమానులు ఈ ఫోటోలపై రకరకాల కామెంట్లతో తమ అభిమానాన్ని చాటుకున్నారు. కొందరు -యువరాణి- అని కొనియాడగా... మరికొందరు -అందం ఓవర్లోడ్ అయింది- అంటూ ప్రశంసల వర్షం కురిపించారు. ఒక అభిమాని సూపర్ మార్కెట్లోని మెరిసే కూరగాయలతో పోలుస్తూ చేసిన సరదా కామెంట్ అందరి దృష్టినీ ఆకర్షించింది. కేవలం అభిమానులే కాకుండా, సినీ రంగానికి చెందిన వర్ధమాన రచయితలు, దర్శకులు కూడా ఈ పోస్ట్ ద్వారా నిహారిక దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేశారు. నిహారిక సొంతంగా బ్యానర్ స్థాపించి నిర్మాణం వైపు అడుగులు వేయడంతో చాలామంది యంగ్ టాలెంట్స్ తమ వద్ద ఉన్న విభిన్నమైన కథలను వివరణాత్మక కామెంట్ల ద్వారా షేర్ చేస్తూ తమకు ఒక అవకాశం ఇవ్వాలని కోరారు. మొత్తానికి నటిగా, నిర్మాతగా తన ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్న నిహారిక, ఇలాంటి గ్లామరస్ ఫోటోషూట్లతో అభిమానులకు నిరంతరం టచ్లో ఉంటోంది. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ప్రాజెక్ట్లతో దూసుకుపోతున్న ఈ యంగ్ బ్యూటీ.. అటు గ్లామర్ పరంగానూ...ఇటు ప్రొడక్షన్ పరంగానూ ఇండస్ట్రీలో తన మార్కును స్పష్టంగా చూపిస్తోంది. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్పై నిహారిక కొణిదెల నిర్మించిన -కమిటీ కుర్రోళ్లు- చిత్రం జాతీయ అవార్డులలో -ఉత్తమ తెలుగు చిత్రం-తో పాటు -బెస్ట్ మేకప్- విభాగంలో అవార్డులను కైవసం చేసుకోవడం సరికొత్త ఉత్సాహాన్ని నింపిన సంగతి తెలిసిందే. ఈ జాతీయ పురస్కార గుర్తింపుపై తీవ్ర భావోద్వేగానికి లోనైన నిహారిక.. సినీ పరిశ్రమలో ఎంతో పాపులారిటీ ఉన్న మెగా కుటుంబ వారసత్వంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును, స్వతంత్ర స్థానాన్ని సంపాదించుకున్నాననే నమ్మకం ఈ విజయం ద్వారానే తనకు లభించిందని సంతోషం వ్యక్తం చేశారు. నటనతో పాటు నిర్మాణ రంగానికి వచ్చిన తాను... సరైన కథలను ఎంచుకుంటే జాతీయ స్థాయి గౌరవాన్ని కూడా అందుకోగలననే బలమైన ఆత్మవిశ్వాసాన్ని ఈ చిత్రం అందించింది. రాజకీయవార్తలు తొలి యత్నంలోనే జాతీయ అవార్డును అందుకోవడంతో నిర్మాతగా నిహారికపై బాధ్యత మరింత పెరిగింది. స్టార్ క్యాస్టింగ్ కంటే కూడా కథా బలం, కొత్తతరంలో ప్రతిభావంతులైన నటీనటులు, దర్శకులను ప్రోత్సహించే దిశగానే నిహారిక తన తదుపరి ప్రాజెక్టులను నిర్మించాలని నిర్ణయించుకున్నారు. కంటెంట్ ఆధారిత చిత్రాల ద్వారా ప్రేక్షకులను అలరించడమే కాకుండా... నమ్మకమైన కథలతో పాటు స్థానిక కళాకారులకు వెండితెరపై అవకాశాలు ఇవ్వడమే తన తదుపరి లక్ష్యమని నిహారిక స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే నిహారిక కొణిదెల తన సొంత బ్యానర్ లో -రాకాస- అనే ఫాంటసీ-కామెడీ చిత్రాన్ని నిర్మించారు. సంగీత్ శోభన్, నయన్ సారిక ప్రధాన పాత్రల్లో నటించగా, పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్పై మానస శర్మ దర్శకత్వంలో దీనిని నిర్మించారు. 2026 ప్రథమార్థంలో విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద



మంచి విజయాన్ని సాధించడమే కాకుండా.. ఒక నిర్మాతగా బాధ్యతాయుతమైన ప్రణాళికను చాటిచెప్పింది. నిర్మాతగా సక్సెస్ అందుకుంటూనే... 2026లో నటిగా కూడా తమిళ చిత్రం -మద్రాస్ కారన్-తో పాటు తెలుగులో కథా ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టులలో నటిస్తూ నిహారిక రెండు వైపులా తన ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నారు.

# ఫ్యాషన్ ఐకాన్ ఫరియా అబ్దుల్లా కిల్లర్ లుక్

చిట్టి ఫరియాగా తెలుగు వారి గుండెల్లో స్థిరపడిపోయింది ఫరియా అబ్దుల్లా. కేవలం ఐదేళ్లలో ఇండస్ట్రీలో ఎంతో తెలివిగా సెలక్టివ్ గా కెరీర్ బండిని నడిపిస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది ఈ భామ. పూర్తి వివరాల్లోకి వెళితే.. తెలుగువెబ్సైట్ టాలీవుడ్ యంగ్ అండ్ డైనమిక్ బ్యూటీ ఫరియా అబ్దుల్లా గ్లామర్ అండ్ ఫ్యాషన్ ప్రపంచంలో ఎప్పుడూ తనదైన మార్కును చూపిస్తూనే ఉంటుంది. ఇటీవల -డాన్స్ ఐకాన్ సీజన్ 2- వేదికపై ఈ భామ ధరించిన కస్టమ్ మేడ్ డెనిమ్ చీర సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. సాంప్రదాయ చీరకట్టుకి భిన్నంగా... స్ట్రీట్వేర్ యాటిట్యూడ్తో డెనిమ్ మెటీరియల్.. బూట్స్ -బెల్ట్లతో ఐశ్వర్య డిజైన్ చేసిన ఈ ఫ్యూజన్ లుక్ ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది. శక్తి స్మరణ్ ఫోటోగ్రఫీ, అనుషా అలీ మేకప్లో ఫరియా సరికొత్త ఫ్యాషన్ ట్రెండ్ను క్రియేట్ చేసిందంటూ నెటిజన్లు కామెంట్ల రూపంలో ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. చిట్టి కిల్లర్ లుక్ అదిరిపోయిందంటూ కితాబు దక్కింది. సినిమాప్రమోషన్ ఫరియా అబ్దుల్లా 2026లో కూడా వరుస సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ ఏడాది -అనగనగా ఒక రాజు- చిత్రంలో పీతాంబరిగా కామియో పాత్రలో మెరవగా, -గాయపడ్డ సింహం- చిత్రంలో షాలిని అనే బలమైన పాత్రతో అలరించింది. వీటితో పాటు తమిళ-తెలుగు ద్విభాషా చిత్రంగా తెరకెక్కుతున్న -సిగ్మా-లోనూ ఫరియా కీలక పాత్ర పోషిస్తోంది. నటనలోనే కాకుండా డాన్స్, పాటల రచన, సింగింగ్లోనూ ప్రయోగాలు చేస్తూ తన బహుముఖ ప్రజ్ఞను నిరూపించుకుంటోంది. ప్రత్యేకించి ఫరియా నటిస్తున్న -సిగ్మా- సినిమా ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుని విడుదలకి సిద్ధమవుతోంది. ఈ తమిళ-తెలుగు ద్విభాషా యాక్షన్ థ్రిల్లర్ లో ఫరియా అబ్దుల్లాతో పాటు సౌత్ ఇండస్ట్రీకి చెందిన ప్రముఖ నటీనటులు సాంకేతిక నిపుణులు పని చేస్తున్నారు. ఒక సరికొత్త కాన్సెప్ట్, సమాజంలో వైవిధ్యమైన నేపథ్యం ఉన్న పాత్రల చుట్టూ తిరిగే కథాంశంతో ఈ చిత్రం రూపుదిద్దుకుందని తెలుస్తోంది. ఈ చిత్రం ద్వారా తమిళంలో కూడా ఫరియా బలమైన పునాది వేసుకోవాలని భావిస్తోంది. ఈ ఐదేళ్లలో సాధించింది ఏమిటి? 2021లో వచ్చిన బ్లాక్బస్టర్ హిట్ -జాతి రత్నాలు- సినిమాలో -చిట్టి- (అడ్వకేట్ షామిలి) పాత్రతో కెరీర్ ప్రారంభించిన ఫరియా.. ఈ ఐదేళ్ల కాలంలో సుమారు ఏడెనిమిది సినిమాలలో నటించింది. మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్లర్, బంగార్రాజు, లైక్ షేర్ & సబ్స్క్రైబ్, రావణాసుర, ఆ ఒక్కటీ అడక్కు, కల్కి 2898 ఇూణ, మత్తు వదలరా 2, గుర్రం పాపిరెడ్డి.. ఇలా వరుస అవకాశాలు దక్కించుకుంది. నటిగా మాత్రమే కాకుండా కొరియోగ్రాఫర్గా, లిరిసిస్ట్గా, సింగర్గా కూడా తన ప్రతిభను చాటుకుంది. తొలి చిత్రంతోనే విశేష గుర్తింపు



తెచ్చుకుని... ఐదేళ్లలో ఇన్ని విభిన్నమైన ప్రాజెక్ట్లలో భాగమవ్వడం ఒక నటిగా గొప్ప విషయమేనని చెప్పవచ్చు. అయితే ఫరియాలో ఉన్న అపారమైన ప్రతిభ, స్క్రీన్ ప్రెజెన్స్, కమాండింగ్ పర్సనాలిటీకి తగినట్లుగా పరిశ్రమలో తనకు మరింత పెద్ద అవకాశాలు, సోలో హిట్ చిత్రాలు రావాల్సి ఉందనేది విశ్లేషకులు-అభిమానుల అభిప్రాయం. కేవలం కామియోలు, సెకండ్ లీడ్ లేదా సపోర్టింగ్ పాత్రలకే పరిమితం చేయకుండా... తనలోని పూర్తి స్థాయి నటిని బయటకు తీసే విధంగా ప్రధాన పాత్రలతో కూడిన లీడ్ ఆఫర్లు ఇస్తే ఫరియా స్టార్ గా తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకునే అవకాశం ఉంది.


# ధనుష్ కొత్త చిత్రం 'ఓం'... టైటిల్ టీజర్ అదిరింది!



విలక్షణ నటుడు ధనుష్ తన 55వ సినిమా టైటిల్ను అధికారికంగా ప్రకటించారు. భారీ అంచనాల నడుమ వస్తున్న ఈ చిత్రానికి 'ఓం' అనే శక్తివంతమైన టైటిల్ను ఖరారు చేశారు. ఈ సందర్భంగా 'ఫస్ట్ స్ట్రైక్' పేరుతో తెలుగు టైటిల్ టీజర్ను చిత్రబృందం శనివారం విడుదల చేసింది. ఈ టీజర్ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. రాజ్కుమార్ పెరియసామి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో తారాగణం ఓ రేంజ్లో ఉంది. మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి, నాచురల్ బ్యూటీ సాయి పల్లవి, టాలీవుడ్ క్రేజీ హీరోయిన్ శ్రీలీల కీలక పాత్రల్లో నటిస్తుండటంతో ఇది ఒక భారీ మల్టీస్టారర్ ప్రాజెక్ట్గా రూపుదిద్దుకుంటోంది. 'చాప్టర్ 1: రుధిరం - ది బ్లడ్ వుడ్' అనే ట్యాగ్లైన్తో విడుదలైన పోస్టర్లు, టీజర్ సినిమా ఎంత పవర్ఫుల్గా ఉండబోతుందో తెలియజేస్తున్నాయి. ధనుష్ ఇందులో సరికొత్త, ఉగ్రమైన అవతారంలో కనిపించనున్నట్లు టీజర్ స్పష్టం చేస్తోంది. ధనుష్ సొంత నిర్మాణ సంస్థ వండర్బార్ ఫిల్మ్స్తో కలిసి ఆర్-టేక్ స్టూడియోస్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నాయి. శ్రద్ధా అగర్వాల్, అజ్మత్ జగ్మద్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. సాయి అభ్యంకర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమాను 2026 అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. విభిన్నమైన కథాంశంతో, భారీ తారాగణంతో వస్తున్న ఈ చిత్రం కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# వెంకీ-త్రివిక్రమ్ 'ఆదర్శ కుటుంబం'లో నారా రోహిత్..

## ఆసక్తి రేపుతున్న ఫస్ట్ లుక్ పోస్టర్




విక్టరీ వెంకటేశ్ కథానాయకుడిగా, ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం' చిత్రంపై ఒక ఆసక్తికరమైన అప్డేట్ వచ్చింది. భారీ అంచనాల మధ్య రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో డైనమిక్ యాక్టర్ నారా రోహిత్ కీలక పాత్రలో నటిస్తున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ హారిక అండ్ హాసిని క్రియేషన్స్ అధికారికంగా ప్రకటించింది. నారా రోహిత్ పుట్టినరోజు సందర్భంగా ఈ విషయాన్ని వెల్లడిస్తూ, ఆయనకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్ను విడుదల చేసింది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ తమ అధికారిక 'ఎక్స్' ఖాతాలో.. "డైనమిక్ నారా రోహిత్ గారికి పుట్టినరోజు శుభాకాంక్షలు. చూాఖ47 ప్రాజెక్టులోకి మీకు స్వాగతం పలుకుతున్నందుకు సంతోషంగా ఉంది. ఈ ప్రయాణం కోసం ఎదురుచూస్తున్నాం" అని పోస్ట్ చేసింది. విడుదల చేసిన పోస్టర్లో నారా రోహిత్ ఇంటెన్స్ లుక్లో కనిపిస్తున్నారు. ఈ పోస్టర్ను బట్టి చూస్తే, ఆయన ఈ చిత్రంలో ఒక పోలీస్ అధికారి పాత్రను పోషిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రానికి 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47 - ూఖ 47' అనే వినూత్నమైన టైటిల్ను గత ఏడాది డిసెంబర్లో ఖరారు చేశారు. అప్పట్లో విడుదల చేసిన టైటిల్ పోస్టర్లో వెంకటేశ్ రోడ్డు మధ్యలో చిరునవ్వుతో నిలబడి ఉన్న లుక్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సినిమాపై మొదటి నుంచీ భారీ అంచనాలు నెలకొన్నాయి. వెంకటేశ్ ఇటీవలే 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంతో బ్లాక్బస్టర్ విజయాన్ని అందుకోగా ఇప్పుడు తన ఫేవరెట్ దర్శకుల్లో ఒకరైన త్రివిక్రమ్తో జత కట్టడం ప్రాధాన్యతను సంతరించుకుంది. నిజానికి త్రివిక్రమ్ దర్శకత్వంలో వెంకటేశ్ హీరోగా నటిస్తున్న పూర్తిస్థాయి చిత్రం ఇదే మొదటిది. గతంలో వీరిద్దరి కాంబినేషన్లో సినిమా రాకపోయినా వెంకటేశ్ కెరీర్లో సూపర్హిట్గా నిలిచిన 'నువ్వు నాకు నచ్చావ్' చిత్రానికి త్రివిక్రమ్ రచయితగా పనిచేశారు. ఆ సినిమా విజయంలో ఆయన సంభాషణలు కీలక పాత్ర పోషించాయి. ఇప్పుడు నేరుగా ఆయన దర్శకత్వంలోనే సినిమా వస్తుండటంతో అభిమానుల్లో అంచనాలు రెట్టింపయ్యాయి. గత ఏడాది ఆగస్టులో ఈ చిత్రానికి సంబంధించిన పూజా కార్యక్రమాలు జరగ్గా, ఈ బుధవారం నుంచి అధికారికంగా షూటింగ్ ప్రారంభం కానుంది. చిత్రాన్ని ఈ ఏడాది అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ఇప్పటికే ప్రకటించారు. నారా రోహిత్ చేరికతో సినిమా తారాగణం మరింత బలంగా మారింది.







